సాక్షి హనుమకొండ

గురువారం । 7 । డిసెంబర్ । 2023



స్వర్ణోత్సవాలకు వేళాయె..
వరంగల్ ములుగు రోడ్డులోని ఎల్‌బీ కళాశాల స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నేటి నుంచి స్వర్ణోత్సవాలు నిర్వహించనున్నారు. - 8లో▸



కేయూలో నిరంకుశ పాలన
కేయూలో నిరంకుశ పాలన కొనసాగుతోందని, ఇక్కడ నెలకొన్న సమస్యలు పరిష్కరించకుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అకుట్ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
27^0 / 20^0

వాతావరణం
'మిచాంగ్' ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

టీఆర్‌టీఎఫ్ కమిటీల ఎన్నిక



రాజబాపురావు



శ్రీనివాస్‌నాయక్



వడ్డె కిషన్




శ్రీపతి కృష్ణమూర్తి

విద్యారణ్యపురి : తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) హనుమకొండ, వరంగల్ జిల్లాల సర్వసభ్య సమావేశం బుధవారం హనుమకొండ సుబేదారిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. అనంతరం రెండు జిల్లాల నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. టీఆర్‌టీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా బాసిరి రాజబాపురావు, ప్రధాన కార్యదర్శిగా గుగులోత్ శ్రీనివాస్‌నాయక్, బాధ్యులుగా గుండ సదానందం, కె.సుజాత, ఎ.శ్రీనివాస్, కె.రమేష్‌ను ఎన్నుకున్నారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా వడ్డె కిషన్, ప్రధాన కార్యదర్శిగా శ్రీపతి కృష్ణమూర్తి, రాష్ట్ర బాధ్యులుగా బత్తిని రాజేష్, పి.ఇందిర, బి.లోకేష్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలోఎన్నికల పరిశీలకుడు టీఆర్‌టీఎఫ్ చీఫ్ ప్యాట్రన్ లక్కిరెడ్డి సంజీవరెడ్డి, కోకన్వీనర్ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది వివరాలు సేకరించాలి

హన్మకొండ అర్బన్: ఇటీవల జరిగిన ఆసెంబ్లీ ఎన్నికల పోలింగ్ విధుల్లో పాల్గొన్న సిబ్బంది వివరాలు సేకరించి ఆన్‌లైన్ చేసి అందుబాటులో ఉంచుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ.. జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో జనవరిలో పంచాయతీల కాల పరిమితి ముగుస్తున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని పోలింగ్ స్టేషన్ల వారీగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది వివరాలు తీసుకోవాలని ఆదేశించారు.

నేటి నుంచి నాలుగు రైళ్లు రద్దు



కాజీపేట రూరల్ : కాజీపేట–ఖమ్మం రూట్‌లో జరుగుతున్న మూడో రైల్వే లైన్ పనులతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు మరో నాలుగు రైళ్లను రద్దు చేసినట్లు స్థానిక రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. ఈ నెల 7, 10, 18వ తేదీల్లో సికింద్రాబాద్–విజయవాడ–సికింద్రాబాద్ మధ్య నడిచే శాతవాహన ఎక్స్‌ప్రెస్, ఈ నెల 10, 18వ తేదీల్లో మణుగూరు–సికింద్రాబాద్–మణుగూరు మధ్య నడిచే కాకతీయ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

తొలిమెట్టు, ఉన్నతిని అమలు చేయాలి

హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్



విద్యారణ్యపురి : పాఠశాలల్లో తొలిమెట్టు, ఉన్నతిని ఉపాధ్యాయులు సమర్థవంతంగా అమలుచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆదేశించారు. మండల విద్యాశాఖాధికారులు, మండల నోడల్ అధికారుల, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో హనుమకొండ లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పదో తరగతి విద్యార్థుల లక్ష్య కార్యక్రమంపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. టెన్త్ ఫలితాల్లో జిల్లాను ముందంజలో ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాలను పెంపొందించాలన్నారు. ఇందుకు లైబ్రరీ పీరియడ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, అవగాహనతో కూడిన అభ్యసనాన్ని పెంపొందించాలన్నారు. కాగా, తొలుత తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల అమలు పర్యవేక్షణ ఎలా నిర్వహించాలనే అంశంపై సీపీడీ సెల్ వరంగల్ డైట్ ఎస్‌ఆర్‌జీ గ్రూప్ వారు అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, ఎస్‌ఆర్‌జీలు మధుసూదన్‌రెడ్డి, కె.సంపత్‌కుమార్, వి.శ్యాంసుందర్, ఎ.శ్రీధర్ పాల్గొన్నారు.

సీల్డ్ కవర్‌లో ఎవరో?



ఓరుగల్లు మంత్రులపై ఇంకా సస్పెన్స్

- ఉప ముఖ్యమంత్రి లేదా కీలక మంత్రిగా సీతక్క పేరు
- రెండో మంత్రిగా కొండా సురేఖకు అవకాశమని ప్రచారం
- అధికారికంగా వెల్లడించని అధిష్టానం
- గవర్నర్‌కు చేరిన మంత్రుల జాబితా..?
- రేవంత్ కేబినెట్‌లో చాన్స్ ఎవరెవరికో

సాక్షి ప్రతినిధి, వరంగల్:

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న పీసీసీ చీఫ్, అనుముల రేవంత్‌రెడ్డి మంత్రివర్గ కూర్పు దాదాపుగా పూర్తయ్యింది. మంగళవారం సాయంత్రం ఢిల్లీకి వెళ్లిన ఆయన బుధవారం సాయంత్రం వరకు అక్కడే గడిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రే మొదలు సోనియాగాంధీ వరకు అందరినీ కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తన కేబినెట్‌లో కొలువుదీరే సచివుల జాబితాపైనా చర్చించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్‌కు సంబంధించి ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్కతోపాటు మరొకరికి చాన్స్ దక్కనుందన్న చర్చ జరుగుతోంది. ఈ మేరకు గురువారం ఆయన హైకమాండ్ ఆమోదం మేరకు తనతోపాటు ప్రమాణ స్వీకారం చేసే సహచర మంత్రుల జాబితాను గవర్నర్ తమిళి సై సౌందరరాజన్‌కు సీల్డ్ కవర్‌లో అందజేసినట్లు చెబుతున్నారు. మధ్యాహ్నం 1.04 గంటలకు రేవంత్ సహా మంత్రివర్గ సహచరులు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో.. ఆ సీల్డ్ కవర్‌లో ఎవరి పేర్లున్నాయనే చర్చ ఆసక్తికరంగా మారింది.

సామాజిక, సీనియారిటీ కోణంలో మంత్రుల జాబితా...

మంత్రివర్గంలో మొదటి విడత జిల్లాలో ఎందరికీ అవకాశం దక్కనుంది? మొత్తం 10 స్థానాల నుంచి గెలిచిన ఎమ్మెల్యేల్లో ఎవరిని మంత్రి పదవి వరించనుంది? అన్న చర్చకు గురువారంతో తెరపడనుంది. అమాత్యుల జాబితాలో ఎవరెవరికీ.. ఏయే కోణంలో అవకాశం దక్కనుందో తేలనుంది. మొత్తం 18 మంది మంత్రుల్లో సామాజిక, రాజకీయ, సీనియారిటీ తదితర అంశాల్లో ప్రాధాన్యత కల్పించనున్నారన్న ప్రచారం ఉంది. ఈ ప్రాతిపదికన జిల్లా నుంచి ధనసరి సీతక్క పేరు తప్పనిసరని తేలింది. సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకగాంధీతో నేరుగా సంబంధాలున్న ఆమెకు ఉప ముఖ్యమంత్రితోపాటు హోంశాఖ దక్కనుందన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఆమెతోపాటు బీసీ మహిళ, తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ పేరు కూడా మంత్రివర్గంలో ఉంటుందన్న చర్చ ఉంది. ప్రచారం జరుగుతున్నట్లు గురువారం రేవంత్‌రెడ్డి ఒక్కరే ప్రమాణ స్వీకారం చేస్తారా? లేక ఆయనతోపాటు మరో ఐదుగురు ప్రమాణం చేయనున్నారా? లేదంటే 12 మందితో చేస్తారా? అనేది బుధవారం రాత్రి వరకు అధికారికంగా ప్రకటించలేదు. దీంతో మంత్రివర్గంలో ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్కకు ఖాయమని తేలినా.. ఏ శాఖ కేటాయిస్తారు.. ప్రమాణ స్వీకారంపై సందేహాలు తొలగడం లేదు.

చివరివరకు పరిశీలనలో ముగ్గురి పేర్లు.. ఇద్దరికీ మంత్రివర్గంలో చాన్స్?

10 అసెంబ్లీ స్థానాలతో కాంగ్రెస్ ఘన విజయం సాధించిన నేపథ్యంలో జిల్లాకు రెండు మంత్రి పదవులు ఖాయమన్న ప్రచారం మొదటినుంచీ సాగుతోంది. వాటికి తోడుగా శాసనసభ స్పీకర్ పదవి దక్కవచ్చన్న ప్రచారం ఉంది. ఇందుకోసం ధనసరి సీతక్క, కొండా సురేఖ, రేవూరి ప్రకాష్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. సీతక్కకు ఉప ముఖ్యమంత్రితోపాటు హోంశాఖ గానీ, మరేదైన ప్రాధాన్యత గల శాఖ ఖాయంగా చెబుతున్నారు. రెండో మంత్రి, స్పీకర్ కోసం కొండా సురేఖ, రేవూరి ప్రకాష్ రెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు బుధవారం రాత్రి వరకు అందిన సమాచారం. రెండో మంత్రిగా జిల్లానుంచి కొండా సురేఖకు చాన్స్ దొరికితే రేవూరి ప్రకాష్ రెడ్డికి శాసనసభ సభాపతి పదవి దక్కవచ్చని.. లేదా ప్రకాష్ రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకుంటే సురేఖ స్పీకర్ అయ్యే అవకాశం ఉంటుందని కాంగ్రెస్ పార్టీలోని సీనియర్లు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ హైకమాండ్ సూచన మేరకు మంత్రుల జాబితా బుధవారమే గవర్నర్‌కు చేరిందన్న ప్రచారం ఆ పార్టీ సీనియర్లనుంచి వినిపిస్తోంది. కాగా, చివరి నిమిషంలో మంత్రివర్గ కూర్పులో భాగంగా ఎవరికి అవకాశం ఇచ్చారు? జిల్లాలో ఇద్దరికి వస్తుందా? ఒక్కరికే పరిమితం చేస్తారా? ఇంతకీ సీల్డ్ కవర్‌లో ఎవరి పేర్లున్నాయి? అన్న చర్చ జరుగుతుండగా.. గురువారమే ఆ సస్పెన్స్‌కు తెరపడుతుందని పార్టీలో కీలక నేతలు చెబుతున్నారు.

చిరు జల్లులతో అన్నదాతలకు కష్టాలు

- కల్లాల్లో తడిసిముద్దయిన ధాన్యం
- పొలాల్లో నేలవాలిన వరిపంట

హన్మకొండ : బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను జిల్లాలోని కొంతమంది రైతులకు కష్టాలు తెచ్చిపెట్టింది. కొన్ని ప్రాంతాల్లో వరి కోత కోసి ధాన్యాన్ని విక్రయించారు. కల్లాలు, మార్కెట్ యార్డుల్లో ఆరబెట్టిన ధాన్యం మోస్తరు వర్షానికి తడిసింది. మరికొన్ని ప్రాంతాల్లో కోయకుండా పంట పొలాల్లోనే ఉన్న వరి నేలవాలింది. నేలవాలిన వరి పంట ఈ వర్షానికి మొలకెత్తి నష్టం వాటిల్లే అవకాశముందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈదురు గాలులతో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. చలితో ప్రజలు వణికిపోతున్నారు. బుధవారం రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంది. అప్పుడప్పుడు చిరు జల్లులు, తుంపరలు కురిశాయి. మంగళవారం ఉదయం 8 నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలను జిల్లా ప్రణాళిక శాఖ విడుదల చేసింది. భీమదేవరపల్లిలో 9.6 మిల్లీమీటర్లు, వేలేరులో 5, ఎల్కతుర్తిలో 9.5, కమలాపూర్‌లో 10.3, హసన్‌పర్తిలో 9.2, ధర్మసాగర్‌లో 5.6, హనుమకొండలో 4.7, ఐనవోలులో 10.7, పరకాలలో 5.7, దామెరలో 13, శాయంపేటలో 17.4, నడికూడలో 8.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. బుధవారం ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలను వాతావరణ శాఖ విడుదల చేసింది. ఆత్మకూరులో 4.8 మిల్లీమీటర్లు, పరకాలలో 4.5, దామెర మండలం పులుకుర్తిలో 3.3, శాయంపేటలో 2.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలి



సదస్సుకు హాజరైన నర్సింగ్ కళాశాల విద్యార్థినులు

దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత

హన్మకొండ అర్బన్ : దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, సామాజిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.సునీత సూచించారు. అంతర్జాతీయ దివ్యాంగుల వారోత్సవాల్లో భాగంగా హనుమకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో 'మానసిక దివ్యాంగుల సమస్యలపై అవగాహన' అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మానసిక దివ్యాంగులు దేవాలయాలకు వెళ్లినప్పుడు వారికి ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.దేవాదాయ శాఖ నుంచి కావాల్సిన అన్ని సహాయ సహకారాలు వారికి అందిస్తామని హామీ ఇచ్చారు. మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకురాలు బండ రామలీల మానసిక దివ్యాంగులకు సమాజంలో కావాల్సిన గుర్తింపు, వారికి అవసరమైన నర్సింగ్ సేవల గురించి ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులకు వివరించారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రావణి, మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

1,84,150 ఎకరాలు

- యాసంగిలో పంటల సాగు అంచనా
- గత సీజన్‌లో 1,79,430 ఎకరాలు
- ఈసారి వరి సాగు అంచనా 1,27,500 ఎకరాలు

హన్మకొండ : హనుమకొండ జిల్లాలో యాసంగి ప్రణాళికను వ్యవసాయ శాఖ రూపొందించింది. అన్ని పంటలు కలిపి మొత్తం 1,84,150 ఎకరాల్లో సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. గతేడాది యాసంగిలో అన్ని పంటలు కలిపి 1,79,430 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి జలాశయాల్లో నీరు ఉండడంతోపాటు సాగుకు అనుకూలంగా కావాల్సిన భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. వరి సాగుతో పోల్చుకుంటే ఆరుతడి పంటల సాగు పెరిగే అవకాశముంది. గతేడాదితో చూసుకుంటే ఈ యాసంగిలో వరి సాగు విస్తీర్ణం తగ్గే అవకాశముందని తెలుస్తోంది. గతంతో పోల్చితే ఈ సారి స్వల్పంగా 4,720 ఎకరాల్లో పంటల సాగు పెరుగవచ్చు. ప్రస్తుత యాసంగిలో 1,27, 500 ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉంది. గతేడాది 1,33,901 ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న ప్రస్తుతం 55,010 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేశారు. గతేడాది యాసంగిలో 31,875 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో వానాకాలం వరి కోతలు పూర్తికాగా, మరికొన్ని ప్రాంతాల్లో వరి కోతకు వచ్చింది. దీంతో రైతులు యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్నారు. విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకుంటున్నారు. జిల్లాలో 31,875 క్వింటాళ్ల వరి విత్తనాలు, 4,401 క్వింటాళ్ల మొక్కజొన్న విత్తనాలు, 600 క్వింటాళ్ల వేరుశనగ, 28 క్వింటాళ్ల శనగ, 38 క్వింటాళ్ల వివిధ రకాల పప్పు దినుసుల విత్తనాలు అవసరమవుతాయి.

రేపు వరంగల్ జెడ్పీ సర్వసభ్య సమావేశం

వరంగల్: వరంగల్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 8వ తేదీ (శుక్రవారం) ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు సీఈఓ రాంరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జిల్లాలోని సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

పీజీ పరీక్షలు ప్రారంభం

కేయూ క్యాంపస్ : కేయూ పరిధిలో పీజీ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. 11 కేంద్రాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. సీకేఎం కళాశాల, వరంగల్ ఎల్‌బీ కళాశాల, యూనివర్సిటీ మహిళా పీజీ కళాశాల పరీక్ష కేంద్రాలను అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఎ.నరేందర్ పరిశీలించారు. గురువారం నుంచి పీజీ రెండో సంవత్సరం పరీక్షలు ప్రారంభమవుతాయి.



వరంగల్ రైల్వే స్టేషన్-బస్టాండ్ జంక్షన్‌లో నిలిచి ఉన్న వర్షపు నీరు

రోగాలు 'ముసురు'కుంటాయి..

మిచాంగ్ తుపాన్‌తో రెండు రోజులుగా చిరు జల్లులు

- ఈదురు గాలులు, చలి తీవ్రతతో వణుకుతున్న ప్రజలు
- ఆస్తమా బాధితులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల సూచన
- నగర రోడ్లపై వర్షపు నీరు.. వాహనదారుల ఇబ్బందులు

ఎంజీఎం/కాశిబుగ్గ : మిచాంగ్ తుపాను ప్రభావంతో రెండు రోజులుగా నగరంలో ఎడతెరిపి లేకుండా ముసురు పడుతోంది. చల్లటి గాలులతో వృద్ధులు, పిల్లలు వణికి పోతున్నారు. వర్షం ఎప్పుడు తగ్గుతుందని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈ గాలులు మంచివి కావని, అవసరమైతేనే పిల్లలు, వృద్ధులు బయటకు రావాలని, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. విషజ్వరాలతోపాటు సీజనల్ వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని వారు పేర్కొంటున్నారు.

చిత్తడిగా మారిన రోడ్లు..

చిరు జల్లులకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంతర్గత రహదారులు చిత్తడిగా మారాయి. కొన్నిచోట్ల రోడ్లపై నీళ్లు నిలిచి ఉండడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పెరుగుతున్న వ్యాధిగ్రస్తులు : డాక్టర్ పవన్‌కుమార్, ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్

వాతావారణంలో సంభవించిన మార్పులతో వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు. ముఖ్యంగా చలికాలంలో సాధారణంగా విషజ్వరాలు, జలుబుతోపాటు ఆస్తమా, నిమోనియా, బ్రాంకైటిస్ లాంటి ఊపిరితిత్తుల సమస్యలు వస్తాయి. వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. నీటి నిల్వలతో దోమలు పెరిగి మలేరియా, డెంగీ ప్రబలుతాయి. చలిలో తిరగకుండా వెచ్చగా ఉండే దుస్తులు ధరించాలి. కాచి, చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. జ్వర తీవ్రతను బట్టి పారాసిటమల్ టాబ్లెట్ వాడుతూ అవసరమైతే డాక్టర్‌ను సంప్రదించాలి.



లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ నుంచి బస్టాండ్ వెళ్లే రోడ్డుపై వర్షపు నీరు



ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఎదుట చిత్తడిగా ఉన్న రోడ్డు

వ్యాధుల నివారణకు చర్యలు : సాంబశివరావు, డీఎంహెచ్‌ఓ

వాతావరణంలో సంభవించే మార్పులతో జలుబు, జ్వరం, ఒళ్లు నొప్పులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. అస్వస్థతకు గురైన వారు పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలకు వెళ్లి చికిత్స పొందాలి. చర్మ వ్యాధులతో బాధపడే వారు యాంటీ ఎలర్జీ, యాంటీ బయోటిక్ మందులను డాక్టర్ సలహాతో మాత్రమే వాడాలి. చలిని తట్టుకోవడానికి స్వెటర్లు, శాలువాలను ఉపయోగించాలి. ఆస్తమా వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా వైద్యులు సూచించిన మందులను క్రమం తప్పకుండా వాడాలి.

లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన కల్పించాలి

కరీమాబాద్ : లింగ నిర్ధారణ పరీక్షల చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ వాకడే అన్నారు. వరంగల్ కలెక్టరేట్‌లో బుధవారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'బేటీ బచావో.. బేటీ పడావో'పై సంబంధిత శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆడ పిల్లల ఎదుగుదల కోసం చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఆడపిల్లల నిష్పత్తి పెంచాలని, గ్రామాల్లో ఆడ పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం బేటీ బచావో.. బేటీ పడావో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా శిశు సంక్షేమ అధికారి శారద, డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, పంచాయతీ అధికారి కల్పన, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వసుధ, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, పోషణ్ అభియాన్, సఖి, చైల్డ్‌లైన్ అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ తదితరులు

ఇం'ధనం'లేదు

పెట్రోల్ బంకుకు బిల్లులు చెల్లించని గ్రేటర్ అధికారులు

- నాలుగు రోజులుగా నిలిచిన పారిశుద్ధ్య వాహనాలు
- మూడు నెలలుగా కార్మికులకు అందని చీపుర్లు
- వసూలు కాని పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు
- ఖాళీ అయిన జీడబ్ల్యూఎంసీ ఖజానా

వరంగల్ అర్బన్ : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య వాహనాలకు డీజిల్ సరఫరా ఆగిపోయింది. సెంట్రల్ జైలు పెట్రోల్ పంపు నిర్వాహకులకు గ్రేటర్ అధికారులు డీజిల్ బిల్లులు చెల్లించకపోవడంతో ఇంధనం పంపిణీని నిలిపివేశారు. రోడ్లు ఊడ్చే కార్మికులకు మూడు నెలలుగా చీపుర్లు ఇవ్వడం లేదు. కరోనా కాలం నుంచి ఇప్పటి వరకు ఇతర పరికరాలు కూడా అందించడం లేదు. దీంతో పారిశుద్ధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డిసెంబర్ మొదలై వారం రోజులు గడిచింది. ఇంత వరకు నవంబర్ వేతనాలు కార్మికుల్లో ఖాతాల్లో జమ కాలేదు. ప్రతినెల పన్నులు వసూలైతేనే జీతాలు, నిర్వహణకు చెల్లింపులు జరుగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రెండు నెలలుగా ఆస్తి, నీటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లు నిలిచిపోయాయి. రాజకీయ ఒత్తిళ్లతో కూడా క్షేత్రస్థాయిలో వసూళ్లు స్తంభించిపోయాయి. జీడబ్ల్యూఎంసీ ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రోజువారీ పనులకు రూపాయి ఖర్చు చేసే అవకాశాలు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఆస్తి, నీటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులను సీరియస్‌గా వసూలు చేయాలని వారాంతపు టార్గెట్లు విధించారు. పన్నుల వసూళ్లలో పురోగతి సాధిస్తేనే జీడబ్ల్యూఎంసీ కార్యకలాపాలు ముందుకు సాగనున్నాయి.



రోడ్డును ఊడుస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు

నగరంలో 512 వాహనాలు..

నగరం నుంచి చెత్త సేకరణ, రవాణా కోసం జీడబ్ల్యూఎంసీకి 512 వరకు వాహనాలున్నాయి. వరంగల్ ఎంజీఎం రోడ్డులోని సెంట్రల్ జైలుకు సంబంధించిన బంకు నుంచి వాహనాలకు డీజిల్‌ను రెండేళ్లుగా పంపిణీ చేస్తున్నారు. రెండు నెలలకు సంబంధించిన రూ.1.80 కోట్లు బకాయిలు చెల్లించకపోవడంతో అధికారులు డీజిల్ పోయడం నిలిపివేశారు. దీంతో బస్తీలు, కాలనీలు, రోడ్లు, డబ్బాల్లో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది. కంప్యాక్టర్లు, ట్రక్కులు, ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటోలు పార్కింగ్ స్థలాలకే పరిమితమయ్యాయి. రెండు రోజుల క్రితం గ్రేటర్ అధికారులు బంకు అధికారులకు రూ.30 లక్షలు చెల్లించగా.. అడపాదడపా డీజిల్ పంపిణీ చేస్తున్నారు. పూర్తిస్థాయిలో చెల్లించకపోవడంతో వాహనాలకు డీజిల్ పంపిణీ నిలిపివేస్తున్నట్లు బంకు అధికారులు వెల్లడించారు. గ్రేటర్‌లోని ఒకరిద్దరు అధికారులు పలు బంకుల యజమానులతో మాట్లాడి కొన్ని వాహనాలకు డీజిల్ పంపిణీ చేస్తున్నారు.

చీపుర్లు సొంతంగా కొనుక్కుంటున్న పారిశుద్ధ్య కార్మికులు

గ్రేటర్ ప్రజారోగ్యం విభాగం ద్వారా మూడు నెలలుగా పారిశుద్ధ్య కార్మికులకు చీపుర్ల పంపిణీ నిలిపివేశారు. టెండర్ గడువు ముగియడంతో సదరు కాంట్రాక్టర్ చీపుర్లు సరఫరా చేయడం లేదు. ప్రతి నెలకు ప్రతి కార్మికురాలికి రెండు చొప్పున చీపుర్లు అందజేయాలి. చీపుర్లు అందించకపోవడంతో కార్మికులు ఒక్కో చీపురును రూ.100కు సొంత డబ్బులతో కొనుగోలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. చీపుర్ల టెండర్ ఖరారు కాలేదనే పేరుతో కాలయాపన చేస్తుండడంతో కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కార్మికులకు వీల్ బ్యారర్లు, పారలు, గ్లౌజులు, ఆప్రాన్లు ఇవ్వడం లేదు. గతంలో చినిగిపోయిన వాటిని వినియోగిస్తున్నారు. పరికరాలు లేకపోవడంతో చేతులతో చెత్త ఎత్తుతూ తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు.



వరంగల్ ఎంజీఎం రోడ్డులోని సెంట్రల్ జైలు పెట్రోల్‌పంపు ఎదుట పారిశుద్ధ్య వాహనాలు

పొంచి ఉన్న ఆర్థిక ముప్పు..

జీడబ్ల్యూఎంసీ ఖజానాలో జనరల్ ఫండ్ ఖాళీ అయింది. ఆర్థిక ముప్పు పొంచి ఉంది. నెలనెలా అదనపు భారం పడుతోంది. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులకు వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం 010 పద్దు ద్వారా ట్రెజరీ వేతనాలు చెల్లిస్తోంది. ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగుల జీతాలు నెలకు రూ.5 కోట్ల వరకు వ్యయం అవుతోంది. అంతేకాకుండా కార్యాలయ నిర్వహణ, కరెంట్ చార్జీలు, డీజిల్, పెట్రోల్, ఇతర రసాయనాలకు రూ.3 కోట్ల మేరకు ఖర్చవుతోంది. ఆస్తి, నీటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేస్తేనే ఈ కార్యకలాపాలు కొనసాగుతాయి.

స్తంభించిన అభివృద్ధి పనులు..

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పన్నుల చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో బల్దియా ఆర్థిక పరిస్థితి క్షీణించి ఖర్చులు రూ.2కోట్ల వరకు పెరిగాయి. అభివృద్ధి పనులు చాలా వరకు స్తంభించిపోయాయి. బల్దియా అధికారులు మాత్రం దిద్దుబాటు చర్యలు చేపడుతున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి

రఘునాథపల్లి : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ కార్మికుడు మృతి చెందారు. ఈ ఘటన బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని రూప రైస్‌మిల్లు సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. బిహార్‌లోని జోదర్‌బీనా గ్రామానికి చెందిన మితినేష్‌మాన్‌జీ(32) స్థానిక రూప రైస్ మిల్లులో హమాలీగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే సాయంత్రం రోడ్డు దాటి హోటల్‌లో టీ తాగి మిల్లుకు వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మిల్లు సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

ధర్మాపురంలో యువకుడు..



దేవరుప్పుల : మండలంలోని ధర్మాపురానికి చెందిన బీఆర్‌ఎస్ మండల యువజన నాయకుడు వంగాల చిరంజీవి (37) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ద్విచక్రవాహనంపై దేవరుప్పుల నుంచి ధర్మాపురానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్ టేలర్‌కు తగలడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే గ్రామస్తులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కాగా, చిరంజీవి మృతిపై పలు పార్టీల నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

'మాస్టార్జీ' సాహిత్యంపై పరిశోధనలు చేయాలి

● కేయూ వీసీ ఆచార్య రమేశ్



కేయూ క్యాంపస్: మాస్టార్జీ సాహిత్యంపై విద్యార్థులు పరిశోధనలు చేయాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అన్నారు. బుధవారం కేయూ తెలుగు విభాగం, హైదరాబాద్ విశ్వజన కళామండలి సంయుక్తంగా నిర్వహించిన 'డాక్టర్ మాస్టార్జీ సాహిత్యం –సామాజికత' అనే అంశంపై ఒక రోజు సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సాహిత్యంలోని పాత్రలు సజీవమన్నారు. విద్యార్థులు తాత్కాలిక ప్రయోజనాలకు లోను కావొద్దన్నారు. అందరిని సమదృష్టితో చూడాలన్నారు. సాహిత్యం ప్రజలకు నేరుగా కనెక్ట్ కావాలన్నారు. అనంతరం నిజామాబాద్‌లోని తెలంగాణ విశ్వవిద్యాలయం ఆచార్యుడు గుండె డప్పు కనకయ్య, హైదరాబాద్ మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఆచార్యులు జి.వి రత్నాకర్, గంగాధరి శ్రీరాములు మాట్లాడారు. తెలుగు విభాగం అధిపతి ఆచార్య బన్న అయిలయ్య అధ్యక్షత నిర్వహించిన ఈ సదస్సులో విశ్వజన కళామండలి బులిటెన్ ఆచార్యుడు జీవీ రత్నాకర్ అనువాద పుస్తకం మాతాదీన్‌ను వీసీ రమేశ్, బన్న అయిలయ్య ఆవిష్కరించారు.

గీత కార్మికుడి ఆత్మహత్య

హసన్‌పర్తి : పురుగుల మందు తాగి ఓ గీత కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హసన్‌పర్తి మండలం మడిపల్లిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ముంజ రాజేశ్(28) గీతవృత్తిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నాడు. బుధవారం కల్లుగీసి తమ వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగాడు. వెంటనే ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతికి గల కారణాలు తెలియలేదు. కాగా, ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

స్వర్ణోత్సవాలకు వేళాయె..

నేటి నుంచి ఎల్‌బీ కళాశాల వేడుకలు



ఎల్బీ కళాశాల ప్రాంగణం

● నెల రోజులు సాగనున్న ఉత్సవాలు
● సమాజానికి ఎంతో మంది ప్రముఖులను అందించిన విద్యాసంస్థ
● ప్రస్తుతం 1800 మంది విద్యార్థులతో కొనసాగుతున్న ఎయిడెడ్ కాలేజీ

రామన్నపేట : వరంగల్ ములుగు రోడ్డులోని లాల్ బహదూర్ కళాశాల(ఎల్‌బీ).. ఈ కళాశాల పేరు తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. త్రిగనరితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారికి కూడా ఈ కళాశాల పేరు సుపరిచితం. 1970లో స్థాపించిన ఈ కళాశాలలో విద్యనభ్యసించిన ఎంతో మంది విద్యార్థులు ప్రస్తుతం ఇండియన్ ఆర్మీతో పాటు పోలీసు, రాజకీయ, క్రీడా, ఇతర రంగాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించారు. అలాగే, వందలాది మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగం చేస్తూ జీవనం కొనసాగుతున్నారు. ఈ కళాశాల స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం నుంచి 30 రోజులు స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో వేడుకులకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు తెలిపారు.

కళాశాల స్థాపన ఇలా జరిగింది ..



స్వర్ణోత్సవ వివరాలు వెల్లడిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

1938లో నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లో ఉస్మానియా గ్రాడ్యుయేట్ అసోసియేషన్, ఎగ్జిబిషన్ సొసైటీని స్థాపించారు. ఆ రోజుల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదివి పట్టభద్రులైనా వారు కొంత మంది సంఘంగా ఏర్పడి ఓజీఏను స్థాపించి 38లో మొదట వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ వస్త్ర ప్రదర్శనను అప్పటి హైదరాబాద్ రాజ్య ప్రధాన మంత్రి నుమాయిష్‌– ఇ– మస్నూయిత్‌–ఇ– ముల్కి ప్రారంభించగా, ఇందులో హస్తకళ ప్రదర్శన, వస్త్ర పరిశ్రమలతో పాటు గ్రామీణ ప్రాంతాల గృహోపరిశ్రమల వస్తువులు విక్రయించేవారు. ఈ వస్త్ర ప్రదర్శనను వంద దుకాణాలతో ప్రారంభించి ప్రతి సంవత్సరం ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ రాజ్యంలో విద్యకు ప్రాధాన్యం ఇచ్చి ఎగ్జిబిషన్‌కు వచ్చిన ఆదాయంలో తెలంగాణలో వివిధ రకాల విద్యాసంస్థలను ప్రారంభించారు. ఈ క్రమంలో వెనుకబడిన ప్రాంతంలో ఏడు డిగ్రీ కళాశాలలు, రెండు పాలిటెక్నిక్ కళాశాలలు, మూడు ఐఐటీ, ఒక నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఈ తరుణంలోనే 1970 సంవత్సరంలో లాల్‌బహదూర్ కళాశాలను స్థాపించారు.

1800 మంది విద్యార్థులకు విద్యాబోధన

ఎల్బీ కళాశాలలో ప్రస్తుతం 1800 మంది విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నాం. ఇంటర్మీడియట్‌లో 400 మంది, డిగ్రీలో 900, పీజీలో 500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం నుంచి కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నాం.

-డాక్టర్ అరుణ డీహెచ్ రావు, ప్రిన్సిపాల్, ఎల్బీ కళాశాల

దినదిన అభివృద్ధి..

1970లో స్థాపించిన కళాశాలకు మొదటి చైర్మన్‌గా దివంగత జయిసేన 1970–73 వరకు వ్యవహరించగా, మొదటి కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎం.ఎస్ రమేశ్ కుమార్ వ్యవహరించారు. అనంతరం దివంగత పర్మాజీ ఈ విద్యాసంస్థకు ఎల్బీ కళాశాల అని నామకరణం చేశారు. 1971లో మహబూబియా హైస్కూల్‌లో ప్రారంభించారు. తరువాత ఇస్లామియా కళాశాలలో అనంతరం ప్రస్తుత ప్రదేశంలో 1972లో చిన్న రేకుల షెడ్డులో జూనియర్ కళాశాలను ప్రారంభించారు. పర్మాజీ వరంగల్ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసి బీఏ, బీకాం కోర్సులు ప్రారంభించారు. ఈ విద్యాసంస్థలకు ప్రభుత్వం, సొసైటీ 26 ఎకరాల భూమిని కేటాయించారు. 1973–74లో గవర్నర్ ఆర్డర్‌లో పెట్టించి ప్రభుత్వం తరపున గ్రాంట్–ఇన్ ఎయిడ్ నిధులు ఇప్పించారు.

ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ శిక్షణలతో విద్యాబోధన..

వరంగల్ నగరంలో ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల పేరు వినగానే టక్కున గుర్తుకు వచ్చేది ఎల్‌బీ కళాశాల. ఇంటర్, డిగ్రీ, పిజీ విద్యనభ్యసిస్తున్న వారికి ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విభాగాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. కాగా, 50 సంవత్సరాల నుంచి సుమారు 500 మంది ఇండియన్ ఆర్మీలో విధులు నిర్వర్తించినట్లు ఎన్‌సీసీ నిర్వాహకులు తెలిపారు.

కేయూలో నిరంకుశ పాలన



డిపార్ట్‌మెంట్లను నిర్వీర్యం చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్లు

● రెండేళ్లయినా విభాగాలకు డీసీ కమిటీల్లేవు
● హెచ్‌ఓడీ ,బీఓఎస్‌ల నియామకాల్లో జాప్యం
● అకుట్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, ఇస్తారి
● సమస్యలు పరిష్కరించాలని రిజిస్ట్రార్‌కు వినతి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో రెండున్నర సంవత్సరాల నుంచి నిరంకుశ పాలన కొనసాగుతోందని, ఇక్కడ నెలకొన్న వివిధ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కేయూ అధ్యాపకుల సంఘం (అకుట్) అధ్యక్షుడు ప్రొఫెసర్ తొటం శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి అన్నారు. ఈ మేరకు బుధవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి శ్రీనివాస్‌రావును కలిసి పది అంశాలపై సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేయూలోని వివిధ విభాగాలను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నారని ఆరోపించారు.కనీసం డిపార్ట్‌మెంటల్ కమిటీలు కూడా రెండేళ్ల నుంచి రెన్యూవల్ చేయలేదన్నారు. డిపార్ట్‌మెంటల్ కమిటీల ద్వారా జరగాల్సిన బదిలీలు,నియామకాలను వీసీ, రిజిస్ట్రార్ నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్నారని విమర్శించారు. వివిధ విభాగాల్లో విభాగాల అధిపతుల (హెచ్‌ఓడీ), బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్‌పర్సన్ల (బీఓఎస్)ను రెండేళ్లకొకసారి మార్చాల్సిండగా కొన్ని విభాగాలల్లో ఇప్పటి వరకు వారినే కొనసాగిస్తూ వ్యక్తిగత కక్షలకు పాల్పడుతున్నారన్నారు. ఫార్మసీ కళాశాలలో ఇప్పటివరకు బీఓఎస్‌ను నియమించకుండా వీసీ, రిజిస్ట్రార్లు తాత్సారం చేస్తున్నారన్నారు. అలాగే ఫిజిక్స్, మ్యాథ్స్, సోషియాలజీ విభాగాల్లో కూడా సీనియారిటీ ప్రకారం హెచ్‌ఓడీ ,బీఓఎస్‌లను నియమించకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించారు.

ఆ అధ్యాపకులకు పదోన్నతులు ఏవీ?

సంవత్సరం క్రితం పదోన్నతులకు దరఖాస్తులు చేసుకొన్ని కొందరి అధ్యాపకులకు ఇప్పటి వరకూ ఇంటర్వ్యూలు నిర్వహించడం లేదని, యూనివర్సిటీ అధికారులు మాత్రం సీనియర్ ప్రొఫెసర్ పదోన్నతులు నియామకాలకు విరుద్ధంగా చేపట్టారని ఆరోపించారు. రిటైర్డ్ అయ్యే చివరి రోజు సీనియర్ ప్రొఫెసర్ పదోన్నతులు తీసుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.వారికి కావాల్సినవారికి పదోన్నతుల కల్పించి కొందరికి సీనియర్ ప్రొఫెసర్లుగా, మరికొందరికి ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించలేదన్నారు.

అధ్యాపకులకు పదోన్నతుల ఎరియర్స్ ఏవీ?

గతేడాదిలో అధ్యాపకులకు రావాల్సిన పదోన్నతుల ఎరియర్స్ మూడు, నాల్గవ ఇన్‌స్టాల్‌మెంట్లు కొందరికి ఇచ్చి మరికొందరికి ఇవ్వడం లేదని అకుట్ అధ్యక్షుడు ఆచార్యుడు తొటం శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారి ఆరోపించారు. యూనివర్సిటీ అధికారులు పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారన్నారు.యూనివర్సిటీలో 16 మంది అడ్జెంట్ ప్రొఫెసర్లను నియమించి వర్సిటీ ఖజానాకు గండి కొడుతున్నారన్నారు.

యూజీసీకి ఫిర్యాదు

కొందరి అధ్యాపకులకు పదోన్నతులు కల్పించకపోవడంపై యూజీసీకి కూడా ఫిర్యాదు చేసినట్లు అకుట్ బాధ్యులు తెలిపారు. 2010 బ్యాచ్ అధ్యాపకులకు కూడా ఇప్పటి వరకు పదోన్నతులకు సంబంధించి ఇంటర్వ్యూలపై నిర్ణయం తీసుకోవడంలేదన్నారు. యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించకుండా మరోవైపు కొందరిని షోకాజ్‌కు నోటీసుల, క్రమశిక్షణ చర్య, బదిలీల పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వారు ఆరోపించారు. తాము రిజిస్ట్రార్‌కు సమర్పించిన పది అంశాలకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అవసరమైతే అధ్యాపకుల సమస్యలపై ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. రిజిస్ట్రార్‌కు వినతి పత్రం సమర్పించిన వారిలో అకుట్ ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ బ్రహ్మేశ్వరి,కార్యవర్గ సభ్యుడు రమేశ్ పాల్గొన్నారు.

ఓటుతోనే మార్పునకు నాంది

● సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్



వలంటీర్‌కు ప్రశంస పత్రం అందజేస్తున్న సుదర్శన్

ఖిలా వరంగల్: సార్వత్రిక ఎన్నికలు ప్రజలను ఆలోచింపజేశాయని, స్వీయ ఆలోచనతో ఓటు వేసి ప్రభుత్వ మార్పుకు నాందిపలికారని సీసీఐ (కన్జూమర్ కాన్ఫడేషన్ ఆఫ్ ఇండియా) రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్ అన్నారు. ఎన్నికల ముందు ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ అనేక ఒత్తిళ్లు ఎదుర్కొని చేపట్టిన ఓటు చైతన్య కార్యక్రమాలు సఫలీకృతమయ్యాయని తెలిపారు. ప్రపంచ వలంటీర్ దినోత్సవం సందర్భంగా బుధవారం వరంగల్ శివనగర్‌లోని సమాఖ్య కార్యాలయంలో మురహరి కార్తీక్ అధ్యక్షతన వినియోగదారుల వలంటీర్ల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి సుదర్శన ముఖ్యఅతిథిగా హాజరై వలంటీర్లకు ప్రశంస పత్రాలు అందజేసి మాట్లాడారు. భవిష్యత్‌లో స్థానిక సంస్థల ఎన్నికల జరగనున్నాయని, ఆస్తి పన్ను తగ్గింపుతోపాటు చెత్తపన్ను తొలిగించాలని, సౌకర్యాలు మెరుగుపరుస్తూ నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువులు,కుంటలకు ఆక్రమణల నుంచి విముక్తి కల్పించి నగరాన్ని వరద ముంపు నుంచి కాపాడాలని కోరారు. త్వరలోనే నూతన సీఎంను కలిసి ధరణి అక్రమాలు, చెరువులు, కుంటల అక్రమణలపై రాష్ట్ర లోకాయుక్త, సెంట్రల్ కన్జూమర్ ప్రొటెక్షన్ అథారిటీ, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో చేసిన ఫిర్యాదులు, కేసులు వివరాలు తెలిసి ప్రభుత్వం తరపున పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ప్రజల నుంచి సేకరించిన పలు అంశాల పత్రాన్ని స్వీకరించారు. ఈ సమావేశంలో నాగరాజు, సతీష్, నరేందర్, కార్తీక్, రమేశ్, వీరభద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

● కాలిబూడిదైన బంగారం, ఇంటి సామగ్రి



కాలిబూడిదైన ఇల్లు

కాటారం: గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గుమ్మాళ్లపల్లిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన సోయం మల్లయ్య, పద్మ దంపతులు ఓ చిన్న ఇంట్లో నివాసముంటున్నారు. ఈ క్రమంలో పద్మ బుధవారం ఉదయం ఇంట్లో దేవుడి చిత్రపటం వద్ద దీపం పెట్టింది. అనంతరం తన కూతురు జన్మదినం సందర్భంగా వరంగల్‌లో తను ఉంటున్న హాస్టల్‌కు పయనమైంది. మల్లయ్య ఇంటికి తాళం వేసి ఉపాధి పనికి వెళ్లాడు. గ్యాస్ లీకవడంతో దీపం మంట అంటుకుని సిలిండర్ పేలింది. ఎవరూ గమనించకపోవడంతో మంటలు పెద్ద ఎత్తున వ్యాపించి ఇంట్లో ఉన్న ఆరు క్వింటాళ్ల పత్తి, కర్ర సామగ్రి, తులంన్నర బంగారం, తులం వెండి, వంట సామగ్రి పూర్తిగా కాలిబూడిదైంది. అటువైపు వెళ్లిన వారు గమనించి మంటలు ఆర్పడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం దక్కలేదు. ఫైరింజన్‌కు సమాచారం అందించినప్పటికీ స్పందించలేదని స్థానికులు ఆరోపించారు. కాగా, ప్రభుత్వం నిరుపేద మల్లయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

హన్మకొండ: అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ టీఎస్ ఎన్పీడీసీఎల్ కంపెనీ శాఖ కార్యదర్శి బక్క దానయ్య అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ రూరల్ సబ్ డివిజన్ కార్యాలయంలో బుధవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు తౌర్య, బాబు, కోశాధికారి స్వదేశ్ కుమార్, నాయకులు చలపతి, రవి, విజయ్, విజయరాజు, శ్యామ్ కుమార్, కొమ్ము రవి, రాజు, సుగుణ పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో..

హనుమకొండ ఆర్టీసీ కాలనీలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, ప్రజా సంఘాల నాయకులు అంబేడ్కర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డెన్ కృష్ణ, తెలంగాణ చరిత్ర ఫ్యాకల్టీ లింగస్వామి పాల్గొన్నారు.

ముగ్గురిపై అట్రాసిటి కేసు

కమలాపూర్: మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన ముగ్గురిపై బుధవారం రాత్రి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీమా ఫర్హీన్ తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. నవంబర్ 23వ తేదీన శనిగరం గ్రామానికి చెందిన బండి సామ్రాజ్యం కుటుంబంతో కలిసి ఊరికి వెళ్తూ తమ గేదెలకు గడ్డి, నీళ్ల తాగించాలని పక్కటింగంగినేని దివ్యను కోరారు. దీంతో దివ్య వారి గేదెలకు మేత వేస్తుండగా ఇంటి పక్కనే ఉన్న బండి రమేష్, బండి శారద, బండి కమలమ్మ అనే ముగ్గురు బండి సామ్రాజ్యంతో ఉన్న పాత గొడవలను దృష్టిలో ఉంచుకొని కుక్కలు, కోళ్లపై నెపం పెట్టి దివ్యను బూతులు తిట్టారు. ఆ తర్వాత 25వ తేదీన దివ్య తన కూతురిని స్కూల్‌కు పంపించేందుకు తన సోదరుడి బైక్ ఎక్కిస్తుండగా బండి శారద మళ్లీ దూషించింది. ఎందుకు తిడుతున్నావని అడిగినందుకు దివ్యను కులం పేరుతో ఇష్టానుసారంగా దూషించింది. తనను కులం పేరుతో దూషిస్తూ మానసికంగా వేధిస్తున్నారని దివ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

గంజాయి రవాణా కేసులో నిందితుడికి 12 ఏళ్ల జైలు

కొత్తగూడెంటౌన్: గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన నిందితుడికి 12 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి(సెషన్స్ జడ్జి ఎన్‌డీపీఎస్ యాక్ట్) ఎం.శ్యాంశ్రీ బుధవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం తీర్పు వివరాలిలా ఉన్నాయి. 2020 జూలై 10న భద్రాచలం సబ్ ఇన్‌స్పెక్టర్ పి.రామయ్య తమ సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. భద్రాచలం సబ్ జైలు కరకట్ట వద్ద ఆగి ఉన్న కారులో తనిఖీ చేయగా రూ.32లక్షలకు పైగా విలువైన 219.200 కేజీల గంజాయి లభ్యమైంది. కారులోని వ్యక్తిని విచారించగా వరంగల్ శివనగర్‌కు చెందిన తోకల కుమారస్వామిగా గుర్తించి అదుపులోకి తీసుకున్న పోలీసులు కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం కు మారస్వామికి 12ఏళ్ల క ఠిన కారాగార శిక్షతో పా టు రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీ ర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరపున అదన పు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రావి విజయ్‌కుమార్ వాది ంచగా, ఎం.హరిగోపాల్, గంజి శశిధర్ సహకరించారు.

అకాలం.. ఆగమాగం

● మిచాంగ్ తుపాన్‌తో విలవిల
● నీటమునిగిన పలు పంటలు
● లక్షలాది రూపాయల నష్టం
● కన్నీరుమున్నీరవుతున్న అన్నదాతలు
● ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

అకాల వర్షం అల్లకల్లోలం సృష్టిస్తోంది. రెండు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా ఈదురుగాలులతో కురుస్తున్న 'మిచాంగ్' తుపాన్‌తో చేతికందిన పంటలు నీట మునుగుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రధానంగా వరి పంట నేలవాలింది. మిరప తోటలు నీటమునిగాయి. మొక్కజొన్న నేలవాలింది. పత్తి కాయలు రాలి కిందపడ్డాయి. అలాగే, ఆరబెట్టిన ధాన్యం నీటిపాలైంది. దీంతో లక్షలాది రూపాయల నష్టం సంభవించడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ విపత్తుపై ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

-సాక్షి నెట్‌వర్క్



కొత్తగూడ: దుర్గారం గ్రామంలో నేల వాలిన మొక్కజొన్న




గార్ల: మండలంలో నీట మునిగిన వరి పంటను చూపుతున్న రైతులు



భూపాలపల్లి రూరల్: వర్షానికి కొత్తపల్లిలో నేలరాలిన పత్తి కాయలు



ఖానాపురం: కొత్తూరులో నేలవాలిన వరి పంట



ఏటూరునాగారం: నీట మునిగిన మిర్చి తోటలు



ఏటూరునాగారం: తడిసిన ధాన్యం